క్లుప్తంగా

ఎంపీడీఓగా శ్రీవాణి



చెన్నారావుపేట : స్థానిక ఎంపీడీఓగా నల్ల శ్రీవాణి శుక్రవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దయాకర్ నుంచి ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. కరీంనగర్ నుంచి ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆమెకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ దయాకర్, ఎంపీఓ శ్రీధర్, ఏపీఎం ఈశ్వర్, ఏపీఓ అరుణ, సీనియర్ అసిస్టెంట్ నరేందర్, జూనియర్ అసిస్టెంట్ సమ్మయ్య, టైపిస్ట్ రజిత, ఆఫీస్ సబార్డినేటర్‌లు నీల, కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

సూపరింటెండెంట్‌గా ఆయేషా పర్వీన్



మండల ప్రజాపరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా ఆయేషా పర్వీన్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆమె పర్వతగిరి నుంచి బదిలీపై రాగా ఇక్కడ విధులు నిర్వహించిన గద్దం దయాకర్ నెక్కొండకు బదిలీ అయ్యారు.

మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకేజీ



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద గ్రామంలోని ఆకేరు వాగు సమీపంలోని మిషన్ భగీరథ పైపులైన్ వాల్వ్‌కి లీకేజీ చోటు చేసుకుంది. దీంతో నీరు భారీగా వృథా పోతోంది. సుమారు 24 గంటలుగా నీరు వృథా పోతున్నా మిషన్ భగీరథ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు వెంటనే లీకేజీకి మరమ్మతులు చేయించి నీటి వృథా అరికట్టాలని కోరుతున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలో తనిఖీ



దుగ్గొండి : మండలంలోని వెంకటాపురంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపీడీఓ లెక్కల అరుంధతి శుక్రవారం తనిఖీ చేశారు. మంచినీటి వసతి కోసం ఏర్పాటు చేసిన నల్లాలను పరిశీలించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, మూత్రశాలలను సందర్శించి సూచనలు చేశారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



చెన్నారావుపేట : సుమారు 11 ఏళ్లుగా ఒకే చోట పని చేస్తున్న తమను బదిలీ చేయాలని కోరుతూ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో శుక్రవారం ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్ శేఖర్ మాట్లాడారు. ఈ ఏడాది జూన్, జులైలో బదిలీ చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినా అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టడం లేదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్, రాజ్‌కుమార్, అనిల్, శృతి, నాగేంద్ర, వెంకటేశ్వర్లు, రవిశంకర్, భవానీ, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



గీసుకొండ : మండలంలోని ఆరెపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేసి బదిలీ అయిన ధినేశ్‌ను గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. గ్రామానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తిరుపతి, జ్యోతి, రఘుపతిరెడ్డి, కమలాకర్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా



చెన్నారావుపేట : బీఆర్‌ఎస్ పార్టీ మండల కన్వీనర్ పదవికి, సభ్యత్వానికి మాజీ వైస్‌ఎంపీపీ కంది కృష్ణారెడ్డి రాజీనామా చేశారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు వెల్లడించారు.

చినుకు పడితే చిత్తడే

- పట్టణంలోని రోడ్లు బురదమయం

నర్సంపేట : జిల్లాలోనే అత్యంత గుర్తింపు పొందిన స్థానిక మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చినుకు పడితే చిత్తడే.. అంటూ జనం చిరాకు పడుతున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని అన్ని వార్డులు, కాలనీలు బురదమయం కావడంతో ప్రజలు నడక సాగించడంలోనూ ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రాంతాల్లో కాలు వేస్తే తీయలేనంతగా బురద ఉన్నా మున్సిపల్ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణం 24 వార్డుల పరిధిలో సుమారు 40 వేల జనాభా కలిగిన ప్రాధాన్యత ఉన్నప్పటికీ మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లను బాగు చేయడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. 8వ వార్డు పరిధిలోని బాలాజీనగర్‌లో కాలనీవాసులు బురదలోనే నిరసన తెలిపారు. సర్వాపురంలోని భారత్ గ్యాస్ గోదాం రోడ్డు పూర్తిగా బురదమయం అయ్యింది. ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలోని అన్ని రోడ్లనూ యుద్ధప్రాతిపదికన బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



సర్వాపురంలోని గ్యాస్ గోదాం రోడ్డుపై బురద

ఒకటో వార్డులో..

ఒకటో వార్డు పరిధిలోని మట్టి రోడ్లు బురదమయం అయ్యాయి. అడుగుపెడితే తీయరాని విధంగా రోడ్ల దుస్థితి నెలకొంది. ఏటా కోట్ల రూపాయలతో బడ్జెట్ పెడుతున్నా నిధులు ఎటు మళ్లుతున్నాయో తెలియడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. మునిపాలిటీ అధికారులు, చైర్‌పర్సన్ తీరు పట్ల కౌన్సిలర్లు సైతం అసహనంతో ఉన్నారు. వార్డు పరిధిలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం ఎదుట భక్తులు, బాటసారులకు ఇబ్బందిగా ఉందని ఇటీవల జరిగిన సాధారణ సమావేశంలో అడిషనల్ కలెక్టర్, కమిషనర్, చైర్‌పర్సన్, మునిసిపల్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానందం ఆందోళన వెలిబుచ్చారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయించాలని కౌన్సిలర్ కోరారు.



బాలాజీనగర్‌లో నిరసన తెలుపుతున్న స్థానికులు



వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద..

సమస్యలను పరిష్కరించండి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ జోనా

- మునిసిపల్ కమిషనర్ జోనా
- అధికారులు, సిబ్బందితో సమీక్ష

వర్ధన్నపేట : పట్టణంలో నెలకొన్న రోడ్లు, ఇతర సమస్యలను పరిష్కరించాలని అధికారులు, సిబ్బందిని మునిసిపల్ కమిషనర్ జోనా ఆదేశించారు. 'సాక్షి' ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'ఫోన్ ఇన్' కార్యక్రమానికి ఆయన స్పందించారు. గురువారం యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టడంతో పాటు అధికారులు, సిబ్బందితో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో పట్టణంలో మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తరలించాలని, వార్డుల వారీగా సమస్యలు గుర్తించి పరిష్కరించాలని దిశా నిర్దేశం చేశారు. డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఏఈ అనిల్, సంతోశ్, కిరణ్, ప్రవీణ్, శ్రవణ్, విజయ్, కుమారస్వామి, కుమార్ పాల్గొన్నారు.

సాక్షి స్పందన

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



వర్ధన్నపేట: నివాళులర్పిస్తున్న టీచర్లు, విద్యార్థులు



నర్సంపేట రూరల్: చిత్రాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

వర్ధన్నపేట : కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని మండలంలోని ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాలలో అమర జవానుల చిత్రపటాలకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వేణు మాట్లాడారు. దేశ భద్రతలో జవానుల సేవలు మరువలేనివని కొనియాడారు. 1999 జులై 26న లడక్ జిల్లా కార్గిల్ హిమాలయాల ప్రాంతంలో జరిగిన యుద్ధంలో ప్రాణాలర్పించిన జవానులను స్మరించారు. విద్యార్థులతో జై జవాన్, జై కిసాన్ నినాదాలు చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి ఉషారాణి, శ్రీదేవి, విజయ్, సాంబయ్య, రాజు, రూపరాణి, వీరస్వామి, రాజపద్మ, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ టెక్నో స్కూల్‌లో..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ టెక్నో స్కూల్‌లో ఎన్‌సీసీ పదో బెటాలియన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్ రియాజొద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహనతో సైబర్ నేరాలకు చెక్



వర్ధన్నపేట : అవగాహన పెంచుకోవడం ద్వారా సైబర్ నేరాలకు చెక్ పెట్టొచ్చని ఎస్సై రాజు తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఆయన ప్రజలతో మాట్లాడారు. ఆన్‌లైన్ వేదికగా సైబర్ నేరగాళ్లు అమాయకులను మోసం చేస్తున్నారని తెలిపారు. సోషల్ మీడియాలో స్నేహితులు, బంధువుల పేర్లపై బ్యాంకు ఖాతా తెరిచి అత్యవసరంగా డబ్బు కావాలని, లాటరీ తగిలిందని, తదితర మోసపూరిత మాటలతో డబ్బు దండుకుంటున్నారని చెప్పారు. సైబర్ నేరాల బారిన పడితే బాధితులు వెంటనే జాతీయ హెల్ప్ లైన్ టోల్‌ఫ్రీ నంబర్ 1930తోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న వెబ్‌సైట్లకు లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరగాలి

ఖానాపురం : ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలని మాతా, శిశు సంరక్షణ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పద్మశ్రీ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శుక్రవారం ఆమె సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. గర్భిణులు సకాలంలో వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హైరిస్క్ కేసులను గుర్తించి ఎప్పటికప్పుడు అవసరమైన పరీక్షలు చేసి సుఖప్రసవాలు జరిగేలా చూడాలని చెప్పారు. అనారోగ్యం బారిన పడకుండా గర్భిణులు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యుడు అరుణ్‌కుమార్, సూపర్‌వైజర్ దేవిక, ఏఎన్‌ఎంలు జ్యోతి, రమ్య, హెల్త్ అసిస్టెంట్లు భాస్కర్, రాంప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పద్మశ్రీ

రిక్రూట్‌మెంట్‌లో పారదర్శకత పాటించాలి



అధికారులతో మాట్లాడుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : మెడికల్ కళాశాలలో రిక్రూట్‌మెంట్‌లో పారదర్శకత పాటించాలని బీజేపీ జిల్లా నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి కోరారు. పట్టణంలో చేపట్టిన జిల్లా ఆస్పత్రి, మెడికల్ కళాశాల భవన నిర్మాణాలను ఆయన ఆధ్వర్యంలోని బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా రాణాప్రతాప్‌రెడ్డి రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజలకు, భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు రిక్రూట్‌మెంట్‌లో అవకాశాలు కల్పించాలని సూచించారు. నవోదయ అవుట్‌సోరింగ్ ద్వారా రిక్రూట్‌మెంట్‌లో అవకతవకలు జరుగుతున్న విషయంలో తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పారదర్శకంగా చేపట్టాలని కోరినట్లు తెలిపారు. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 110 పోస్టులకు స్థానిక యువతకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు, కౌన్సిలర్లు జుర్రు రాజుయాదవ్, గోల్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

టీషర్టుల పంపిణీ



నల్లబెల్లి : మండలంలోని మేడపల్లి హైస్కూల్‌లో సుమారు 150 మంది విద్యార్థులకు తెలంగాణ జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కన్వీనర్ పింగిళి కవితరెడ్డి టీషర్టులు, బెల్టులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు లక్ష్మీనారాయణ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణ అలవర్చుకుని ఉన్నతంగా ఎదిగి సమాజ సేవలో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం కవితరెడ్డి మాట్లాడారు. విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చే దిశగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు కీర్య, కుమారస్వామి, సోమ, వాల్య, మోహన్‌లాల్, సవిత, నర్సింహ, కృష్ణమూర్తి, రవీందర్, రామరాజు, మహేందర్, రవి పాల్గొన్నారు.

గుడుంబా, గంజాయితో సమాజానికి నష్టం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ బాబూలాల్

గీసుకొండ : గుడుంబా, గంజాయి, తదితర ప్రభుత్వ నిషేధిత వస్తువుల తయారీ, విక్రయాలతో సమాజానికి నష్టం వాటిల్లుతుందని తహసీల్దార్ రియాజుద్దీన్, సీఐ బాబులాల్, పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో గుడుంబా తయారీదారులు, విక్రేతలకు శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. నాటుసారా, నల్లబెల్లం, గంజాయి, తదితరాల తయారీ, విక్రయాలను మానుకుని వ్యవసాయ ఆధారిత పనులు చేసుకుంటూ ఉపాధి పొందాలని సూచించారు. గుడుంబా, గంజాయి తాగి చాలా మంది ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోతున్నారని తెలిపారు. వాటిని తయారు చేసినా, విక్రయించినా పీడీ చట్టం ప్రయోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు కుమార్, జ్యోతి, పంచాయతీ కార్యదర్శి శంకర్‌రావు, ఎన్‌పీడీసీఎల్ ఏఈ సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి

పర్వతగిరి : రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో జీవించడాన్ని అలవర్చుకోవాలని సీఐ శ్రీనివాస్ సూచించారు. పర్వతగిరి సర్కిల్ పరిధిలోని పర్వతగిరి, సంగెం, ఐనవోలు పోలీస్‌స్టేషన్లలో నమోదైన రౌడీషీటర్లు, డెకాయిట్లు, సీవియర్ క్రిమినల్ కేసుల్లోని ముద్దాయిలకు ఆయన శుక్రవారం కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రౌడీషీటర్లందరూ సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో అటెండెన్స్ వేయాలని తెలిపారు. ఇతర ప్రాంతాలకు వెళ్తే స్టేషన్ అధికారి అనుమతి తీసుకోవాలని చెప్పారు. సెటిల్‌మెంట్లు, భూదందాలు, పంచాయతీల జోలికు వెళ్లవద్దని హెచ్చరించారు. సత్ప్రవర్తన కలిగి ఉంటే రౌడీషీట్ ఎత్తివేసే అవకాశం ఉందన్నారు. సమావేశంలో పర్వతగిరి, సంగెం, ఐనవోలు ఎస్సైలు వెంకన్న, నరేశ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ శ్రీనివాస్

బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన

నర్సంపేట : పట్టణంలో బడ్జెట్ ప్రతులను పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగాన్ని విస్మరించిందని విమర్శించారు. ప్రభుత్వం విద్యా రంగానికి కేవలం 7.31 శాతం నిధులు కేటాయించిందని తెలిపారు. బడ్జెట్‌ను సవరించి విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అజిత్, సునీల్, కిశోర్, సాయి, పావని, మౌనిక, శ్రీలత, రజిత, సాయిని, సునీత, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు అన్యాయం

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు తక్కువగా నిధులు కేటాయించి అన్యాయం చేసిందని ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యుడు కొత్తకొండ రాజమౌళి మండిపడ్డారు. పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, వైద్య రంగాలకు అరకొర నిధులు కేటాయించిందని తెలిపారు. రైతుభరోసాకు నిధులు కేటాయించలేదని చెప్పారు. బడ్జెట్‌తో కాంగ్రెస్ ప్రభుత్వ బండారం బట్టబయలు అయ్యిందని తెలిపారు.

వర్షాకాలంలో ఆరోగ్య పరిరక్షణ కీలకం



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అర్చన, సిబ్బంది

నెక్కొండ : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆరోగ్య పరిరక్షణ కీలకమని మండలంలోని అలంకానిపేట పీహెచ్‌సీ వైద్యురాలు అర్చన తెలిపారు. పెద్దకొర్పోలులోని కేజీబీవీలో గురువారం నిర్వహించిన వైద్యశిబిరంలో ఆమె విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం మాట్లాడారు. విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించడంతోపాటు పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యురాలు సుధ, సూపర్‌వైజర్లు రాజు, రమాదేవి, గురుకుల ఎస్‌ఓ రజిత, ఆశ కార్యకర్త జ్యోతి, ఉపాధ్యాయులు సునీత, లక్ష్మి, జ్యోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

సంతాప సభను విజయవంతం చేయాలి

నర్సంపేట : ఖమ్మంలో ఈనెల 28న ఎస్‌ఆర్ గార్డెన్‌లో తలపెట్టిన రాయల చంద్రశేఖర్ సంతాప సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి కోరారు. అశోక్‌నగర్, నర్సంపేట, సర్వాపురం, మాధన్నపేట, తదితర గ్రామాల్లో ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అడ్డూరి రాజు అధ్యక్షతన చంద్రశేఖర్ చిత్రపటానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూరి మాట్లాడారు. పార్టీలో చంద్రశేఖర్ క్రియాశీలక బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దార లింగన్న, రవి, చొప్పరి పైడి, నర్సింహస్వామి, ఇజ్జగిరి కొమురయ్య, సుధాకర్, వియంగాల సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

సంగెం : కుటుంబ వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ తెలిపారు. లింగ ఆధారిత హింస, మహిళా రక్షణ చట్టాలపై స్థానిక రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్నా సమాజంలో లింగ వివక్షత కొనసాగుతోందని ఆందోళన వెలిబుచ్చారు. పురుషాధిక్యత, కొన్ని అనాగరిక కట్టుబాట్లతో మహిళలు అనేక రకాల హింసకు గురవుతున్నారని తెలిపారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆపద కాలంలో డయల్ 100 లేదా 181కు ఫోన్ చేసి రక్షణ పొందాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై ఎల్.నరేశ్, సంస్థ సభ్యులు కవిరాజ్, అక్తర్, వాణి, సఖి వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ శ్రీలత, లీగల్ కౌన్సిలర్ శోభారాణి, స్వయం సహాయక సంఘాల లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అరుదైన శస్త్రచికిత్స

వర్ధన్నపేట: పట్టణంలోని శ్రీవెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించినట్లు ఆస్పత్రి నిర్వాహకుడు డాక్టర్ రాజనరేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన పాకనాటి అనసూయకు తొడ భాగంలో పెద్ద కణితి ఏర్పడి అవస్థ పడుతోంది. ఆమె ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోగా తొడ భాగంలో పెద్ద కణితి ఏర్పడిందని నిర్ధారించారు. శుక్రవారం డాక్టర్ వంగాల రాజనరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య బృందం శస్త్ర చికిత్స చేసి మూడు కిలోల కణితిని తొలగించినట్లు తెలిపారు.

'ఎస్‌ఆర్‌ఆర్' చేయూత

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గంట వెంకన్న ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం చేయూత అందించారు. తొలుత ఫోన్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామస్తుల ద్వారా బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు పంపించారు.

పరిహారం చెక్కు అందజేత

చెన్నారావుపేట : మండలంలోని బోడ మాణిక్యం తండాకు చెందిన బోడ సురేశ్ సుమారు 10 నెలల క్రితం విద్యుదాఘాతానికి గురై మృతి చెందగా అతడి భార్య సుజాతకు విద్యుత్ శాఖ నర్సంపేట డీఈ శ్రీధర్, నెక్కొండ ఏడీ మలేశం శుక్రవారం రూ.5 లక్షల పరిహారం చెక్కు అందజేశారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15వ డివిజన్‌లోని రెడ్డిపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన నడకట్టు వేణుగోపాల్‌రెడ్డి రూ.500 సహాయం అందించగా శుక్రవారం నోట్‌బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు, డ్రాయింగ్ సామగ్రి అందించారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చెన్నారావుపేట : ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీల సంక్షేమానికి రూ.33 వేల 124 కోట్లు, ఎస్టీల కోసం రూ.17 వేల 56 కోట్లు విడుదల చేయడం హర్షణీయమని చెప్పారు.

నివాళి

గీసుకొండ : మండలంలోని గీసుకొండకు చెందిన ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి కందికొండ కుమారస్వామి అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, కార్యదర్శివర్గ సభ్యుడు గోనె కుమారస్వామి, తదితరులు శుక్రవారం నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

ఆర్థికసాయం

సంగెం : మండల కేంద్రానికి చెందిన డ్రైవర్ మెట్టుపల్లి భాస్కర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన పులి రాజశేఖర్ స్థానిక వాట్సప్, ఇతర వాట్సప్ గ్రూపుల ద్వారా దాతల నుంచి సమీకరించిన రూ.71 వేల 730 నుంచి రూ.50 వేలు భాస్కర్ తల్లి పేరిట చేసిన డిపాజిట్ బాండ్, రూ.21 వేల 730 నగదుతోపాటు క్వింటా బియ్యం సాయంగా అందజేశారు.

పరామర్శ

సంగెం : వరంగల్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావును అతడి తండ్రి సుబ్బారావు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో మండలంలోని గుంటూరుపల్లిలోని నివాసంలో తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్, అరూరి రమేశ్, తదితరులు పరామర్శించారు.

కాంగ్రెస్ నాయకుడికి..

పర్వతగిరి : కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ మండల నాయకుడు జిల్లా కనకయ్యను ఇటీవల కాలుకు గాయమై ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సందర్భంగా ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దబ్బెట నర్సయ్య, మండల కన్వీనర్ నరుకుడు రవీందర్ శుక్రవారం పరామర్శించారు.

ఇంటి నిర్మాణ అనుమతి రద్దు చేయాలి

నర్సంపేట : పట్టణంలోని సర్వే నంబర్ 121లోని ప్రభుత్వ భూమిలో యాదగిరి చేపట్టిన ఇంటి నిర్మాణ అనుమతి రద్దు చేయాలని కోరుతూ టౌన్ ప్లానింగ్ అధికారి నాగరాజుకు దళిత, ప్రజాసంఘాల జేఏసీ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. తొలుత మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్, నియోజకవర్గ కోకన్వీనర్ తడుగుల విజయ్, డీపీఆర్పీఎస్ జాతీయ అధ్యక్షుడు రవి మాట్లాడారు.

ఫిర్యాదు అర్థరహితం

దళిత సంఘాల జేఏసీ నాయకులు మునిసిపల్ కార్యాలయంలో చేసిన ఫిర్యాదు అర్థరహితమని పెండ్యాల యాదగిరి, మండల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. పట్టణంలోని సర్వే నంబర్ 129 (ఓల్డ్), 121 (న్యూ)లోని భూమిలో తమకు చట్టపరమైన హక్కులు ఉన్నాయని, రిజిస్ట్రేషన్ దస్తావేజులు కలిగి ఉన్నామని తెలిపారు.

రూ.50 వేల కోట్లు కేటాయించాలి

సంగెం : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి రూ.50 వేల కోట్లు కేటాయించాలని ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఇస్మాయిల్ మాట్లాడారు. రాష్ట్రానికి బడ్జెట్‌లో సరైన విధంగా నిధులు కేటాయించలేదని విమర్శించారు.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువు

నల్లబెల్లి : బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీజేపీ మండల అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో నర్సంపేట నియోజకవర్గానికి నిధులు కేటాయించలేదని చెప్పారు.

దళితుల అభివృద్ధికి ప్రాధాన్యం

వర్ధన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో దళితుల అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చి ఎస్సీ కార్పొరేషన్‌కు భారీగా నిధులు కేటాయించిందని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య తెలిపారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్ వద్ద సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎంపీ కడియం కావ్య, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్, ఎమ్మెల్యే నాగరాజుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడారు. ప్రభుత్వం ఎస్సీల కోసం రూ.33,124 కోట్లు కేటాయించిందని చెప్పారు.

మానవ విలువలతోనే జీవితంలో ఉన్నతి

వర్ధన్నపేట : మానవ విలువలు పాటిస్తేనే జీవితంలో ఉన్నతి సాధిస్తారని సామాజిక కార్యకర్త బంక మాణిక్యరావు తెలిపారు. పట్టణంలోని శ్రీఅరబిందో హైస్కూల్‌లో హెచ్‌ఎం ఠాకూర్, ఏహెచ్‌ఎం దిలీప్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాణిక్యరావు నృత్యం, పాటలతో మానవ విలువలపై అవగాహన కల్పించారు. అనంతరం మాణిక్యరావు మాట్లాడారు.